డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

**విలేకరులు కావలెను..**
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి | మంగళవారం | 03 -02-2026 | సంపుటి: 01 | సంచిక : 16 | పేజీలు : 08 | వెల :02/- |
|---|---|---|---|---|---|---|
| Peddapalli | Tuesday | 03 -02-2026 | Volume: 01 | Issue: 16 | Pages: 08 | Cost :02/- |


2

## నక్సలిజంపై పోరాటానికి రూ.3,610 కోట్లు

- మార్చి 31ని డెడ్‌లైన్‌గా ప్రకటించిన కేంద్రం.
- 20 శాతానికిపైగా పెరిగిన నిధుల కేటాయింపు.
- భద్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి.

## కవిత వ్యాఖ్యలకు కేటీఆర్ స్పందన

- మున్సిపల్ ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు
- జాగృతి అభ్యర్థులపై కవిత ప్రకటన
- స్పందన అవసరం లేదన్న కేటీఆర్


2

- పాఠ్యాంశాల్లో చరిత్ర, విగ్రహ ఏర్పాటు అంశాలపై ప్రభుత్వ నిర్ణయం.
- రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం ప్రదానం.
- తెలంగాణ రైతాంగ పోరాటానికి చిరస్మరణీయ నేతగా ప్రశంసలు.




# రావి నారాయణ రెడ్డి కి సముచిత గౌరవం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జనం వాయిస్, హైదరాబాద్:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డి కి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడం, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి, మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని గౌరవం పెంచే చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం 2025'ను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రావి నారాయణ రెడ్డి జీవితాన్ని సీఎం స్మరించుకున్నారు. అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో రావి నారాయణ రెడ్డి కీలక పాత్ర పోషించారని సీఎం అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పేదల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తిత్వమన్నారు. 'బండెనక బండి కట్టి' మిగతా 2 లో...

## నరవాణే పుస్తకం వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడ


2

- ప్రచురణ కాని పుస్తకం ప్రస్తావించారంటూ అభ్యంతరం.
- రాహుల్-రాజ్‌నాథ్ మధ్య వాగ్వాదం.
- చైనా అంశంపై చర్చించనివ్వాలంటూ విపక్షం డిమాండ్.
- గందరగోళం నేపథ్యంలో సభ వాయిదా.

## తొర్రూరులో 4.5 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్.
- విశాఖ నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా.
- కఠిన చర్యలు కొనసాగుతాయి: డీఎస్పీ.


2

## మిషన్ కాకతీయ దేశవ్యాప్తంగా అమలు

- తెలంగాణ చేసిన పని దేశానికి దారి చూపింది.
- 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్ల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యం.
- కాళేశ్వరం మిషన్ కాకతీయపై మరోసారి కేంద్రం ప్రశంసలు.



**జనం వాయిస్, హైదరాబాద్:** "తెలంగాణ ఈరోజు చేస్తే భారతదేశం రేపు చేస్తుంది" అన్న మాటకు మరోసారి నిజ జీవిత ఉదాహరణ కనిపించింది. తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక మిషన్ కాకతీయ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశాన్ని తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో స్పష్టంగా ప్రస్తావించడం తెలంగాణకు గర్వకారణంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్లను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, మత్స్య సంపదను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు మిగతా 3 లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతం చేయాలి

- కల్వకుంట్ల కవిత డిమాండ్.
- రెండేళ్లుగా కొనసాగుతున్న సిట్ విచారణపై ప్రశ్నలు
- అధికారులు పిలిస్తే హాజరవుతా : కవిత స్పష్టం.
- దోషులకు శిక్ష పడేలా చర్యలు కోరుతూ డిమాండ్.
- కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు.



**జనం వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంపై జరుగుతున్న సిట్ విచారణను త్వరితగతిన ముగించి, దోషులకు మిగతా 3 లో...

## దావోస్ అమెరికా పర్యటన పూర్తి

- అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి.
- శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం.
- హార్వర్డ్‌లో లీడర్‌షిప్ కోర్సు పూర్తి.
- 20 దేశాల ప్రతినిధులతో కలిసి శిక్షణ.


3

## వ్యాక్సిన్ తర్వాత చిన్నారి మృతి

- కామారెడ్డిలో విషాద ఘటన.
- యాంటీ రేబిస్ మూడో డోస్ తర్వాత అపస్మారక స్థితి.
- వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబ ఆగ్రహం.
- విచారణ చేపడతామన్న ఆర్ఎంవో.



**జనం వాయిస్, కామారెడ్డి:** యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసిన కొద్దిసేపటికే రెండున్నరేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కామారెడ్డి లో కలకలం రేపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, కామారెడ్డి మండలం మిగతా 3 లో...

## నామినేషన్ కోసం రూ.8 కోట్ల పన్ను చెల్లింపు

- నిజామాబాద్ కార్పొరేషన్ చరిత్రలో రికార్డు వసూలు.
- మేయర్ రేసులో కాంగ్రెస్ అభ్యర్థి చర్యపై రాజకీయ చర్చ.
- ఎన్నికల వేళ బయటపడిన కోట్ల బకాయిలు.



**జనం వాయిస్, నిజామాబాద్:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సంచలన ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ పదవి రేసులో ఉన్న కార్పొరేటర్ అభ్యర్థి కె. శమంత నరేందర్ రెడ్డి రూ. 8,16,65,000 ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించారు. నామినేషన్‌కు అవసరమైన నో డ్యూ సర్టిఫికేట్ కోసం ఈ భారీ మొత్తం మున్సిపల్ ఖజానాకు చేరింది. 2009 నుంచి దాదాపు 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలు మిగతా 3 లో...

# ఎడిటోరియల్

## నీటితో కలిసి కరుగుతున్న మన భవిష్యత్తు

**జనం వాయిస్, ఎడిటోరియల్:** చెరువులు, సరస్సులు, మడులు, నదీ డెల్టాలు, మాంగ్రూవ్ అడవులు వంటి తడిబూములు ప్రకృతి వ్యవస్థలో నిశ్శబ్దంగా పనిచేసే జీవనాధారాలు. మనకు ప్రత్యక్షంగా కనిపించకపోయినా, నీరు నిల్వ ఉండటం నుంచి వాతావరణ సమతుల్యత వరకు అనేక కీలక బాధ్యతలు ఇవే నిర్వర్తిస్తున్నాయి. వేల సంవత్సరాలుగా మానవ నాగరికతలు తడిబూముల చుట్టూనే వికసించాయి. వ్యవసాయం, పశు పోషణ, మత్స్యకార జీవనం అన్నింటికీ ఇవే ఆధారం. అయినా నేటి ఆధునిక సమాజంలో తడిబూముల విలువను మనం మరిచిపోతున్నాం.

**- అభివృద్ధి అనే పేరుతో జరుగుతున్న వినాశనం**

నగరీకరణ వేగంగా పెరుగుతున్న కొద్దీ తడిబూములు "ఖాళీ భూములు"గా మారుతున్నాయి. చెరువులు పూడ్చి అపార్ట్‌మెంట్లు, ఐటీ పార్కులు, రహదారులు నిర్మించడం సాధారణమైంది. పరిశ్రమల కాలుష్యం సరస్సులను విషపూరితంగా మార్చుతోంది. అక్రమ కబ్జాలు బఫర్ జోన్లను మింగేస్తున్నాయి. అభివృద్ధి అవసరమే అయినా, అది ప్రకృతి నాశనానికి కారణమైతే చివరకు అదే అభివృద్ధి మనపై భారంగా మారుతుంది. వరదలు, నీటి కొరత, భూగర్భ జలాల పతనం ఇవన్నీ తడిబూముల నాశనానికి ప్రత్యక్ష ఫలితాలు.

**- నీటి భద్రతపై పడుతున్న ప్రభావం**

తడిబూములు సహజ నీటి నిల్వలు. వర్షపు నీటిని గ్రహించి భూగర్భ జలాలను నింపుతాయి. కానీ చెరువులు, సరస్సులు నశిస్తే నీరు నిల్వ ఉండే అవకాశం తగ్గిపోతుంది. ఫలితంగా వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒకప్పుడు చెరువుల నీటితో సాగు చేసిన గ్రామాలు నేడు ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. ఇది కేవలం గ్రామాల సమస్య కాదు నగరాలు కూడా ఇదే దారిలో సాగుతున్నాయి.

**- జీవ వైవిధ్యం  నిశ్శబ్దంగా జరుగుతున్న అంతరాయం**

తడిబూములు అనేక జీవజాతులకు ఆశ్రయం. వలస పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి వస్తాయి. చేపలు, ఉభయచరాలు, జలచరాలు, సూక్ష్మజీవులు అన్నీ కలిసి ఒక సున్నితమైన ఆహార గొలుసును నిర్మిస్తాయి. తడిబూములు నశిస్తే ఈ జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. ఒక జాతి అంతరించిపోతే దాని ప్రభావం మరెన్నో జాతులపై పడుతుంది. చివరకు మనుషుల ఆహార భద్రత, ఆరోగ్యం ప్రమాదంలో పడతాయి.

**- వాతావరణ మార్పుతడిబూముల రక్షణ కవచం**

వాతావరణ మార్పు తీవ్రత పెరుగుతున్న ఈ కాలంలో తడిబూములు సహజ రక్షణ కవచాలుగా నిలుస్తాయి. ఇవి కార్బన్‌ను శోషించి నిల్వ చేస్తాయి. భారీ వర్షాల సమయంలో అదనపు నీటిని గ్రహించి వరదల తీవ్రతను తగ్గిస్తాయి. కరువుల సమయంలో భూగర్భ జలాలను నిలబెడతాయి. కానీ మనమే ఈ రక్షణ వ్యవస్థను తొలగించుకుంటే, ప్రకృతి విపత్తుల తీవ్రత మరింత పెరుగుతుంది. వరదలు, తుపాన్లు, కరువులు ఇవి ఇక అసాధారణ ఘటనలు కాకుండా సాధారణమవుతున్నాయి.

**- చట్టాలు ఉన్నా అమలు ఎక్కడ?**

తడిబూముల పరిరక్షణకు చట్టాలు ఉన్నాయి. నిబంధనలు ఉన్నాయి. కానీ అమలు లోపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి కలిసిపోయి తడిబూముల వినాశనానికి దారి తీస్తున్నాయి. చెరువుల పునరుద్ధరణ పేరుతో నిధులు మంజూరు అవుతున్నా, క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించదు. అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిన చోట కళ్లమూసుకోవడం పరిపాటిగా మారింది.

**- ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి**

తడిబూములను కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యతగా వదిలేయలేం. ప్రజల భాగస్వామ్యం లేకుండా పరిరక్షణ సాధ్యం కాదు. చెరువులను చెత్తకుప్పలుగా మార్చకుండా చూడటం, కాలుష్యాన్ని అడ్డుకోవడం, అక్రమ కబ్జాలపై ప్రశ్నించడం ఇవి ప్రతి పౌరుడి బాధ్యత. పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ అవగాహన పెంచాలి. నీటి విలువను పిల్లలకు నేర్పాలి.

**- అభివృద్ధిపర్యావరణం మధ్య సమతుల్యత**

అభివృద్ధి అవసరం. కానీ అది ప్రకృతితో పోరాడుతూ కాకుండా, ప్రకృతితో కలిసి సాగాలి. తడిబూములను రక్షిస్తూ అభివృద్ధి సాధ్యమే. సుస్థిర పట్టణ ప్రణాళికలు, నీటి పునర్వినియోగం, చెరువుల పునరుద్ధరణఇవన్నీ అమలు చేస్తే అభివృద్ధి, పర్యావరణం రెండూ కలిసి ముందుకు సాగుతాయి.

**- భవిష్యత్తుకు స్పష్టమైన సందేశం**

ప్రపంచ తడిబూముల దినోత్సవం ఒక రోజుకు పరిమితమైన కార్యక్రమం కాకూడదు. ఇది మన జీవన విధానాన్ని మార్చే సంకల్పంగా మారాలి. నేడు తడిబూములను కాపాడకపోతే, రేపు నీటి కోసం, ఆహారం కోసం, జీవితం కోసం పోరాడాల్సి వస్తుంది. తడిబూములను రక్షించుకోవడం అంటే కేవలం ప్రకృతిని కాపాడటం కాదుమన భవిష్యత్తును, మన తరాల భద్రతను కాపాడుకోవడమే.

ఈ నిజాన్ని ఇప్పుడైనా గుర్తించకపోతే, రేపు మిగిలేది పశ్చాత్తాపమే.

# రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం

**మొదటిపేజీ తరువాయి...** అంటూ తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి వంటి వారిని ప్రభావితం చేసిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. దేశంలో తొలి ప్రధాని నెహ్రూకన్నా అధిక మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన ఘనత రావి నారాయణ రెడ్డికే దక్కిందని సీఎం గుర్తు చేశారు. ప్రజా తీర్పుకు ప్రతీకగా తొలి పార్లమెంట్ భవనాన్ని నెహ్రూ చేతుల మీదుగా కాకుండా, రావి నారాయణ రెడ్డితోనే ప్రారంభింపజేశారని వివరించారు. 60 ఏళ్ల వయసులోనే రాజకీయ పదవులు, పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడని ప్రశంసించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి జాతీయ పురస్కారం దక్కడం సముచితమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఆయన పోషించిన పాత్ర, అనుభవం పరిపాలనకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




# నక్సలిజంపై పోరాటానికి రూ.3,610 కోట్లు

**జనం వాయిస్, న్యూఢిల్లీ :** దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. మార్చి 31ని డెడ్‌లైన్‌గా పేర్కొంటూ, నక్సలిజంపై పోరాటానికి ఈసారి కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించేందుకు రూ.3,610 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాల కార్యకలాపాలు, పోలీసింగ్ వ్యయం, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు వంటి అంశాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. అలాగే ప్రత్యేక మౌలిక వసతుల అభివృద్ధి పథకాల కోసం కూడా ఈ మొత్తాన్ని రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో (సవరించిన అంచనాల ప్రకారం) నక్సలిజంపై పోరాటానికి రూ.3,006 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. తాజా బడ్జెట్‌లో ఈ వ్యయాన్ని 20 శాతానికి పైగా పెంచుతూ రూ.3,610 కోట్లకు చేర్చడం గమనార్హం. ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం తీసుకుంటున్న కఠిన వైఖరిని స్పష్టంగా చూపుతోంది. నక్సలిజం నిర్మూలనతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కూడా కేంద్ర లక్ష్యంగా పెట్టుకున్నట్లు బడ్జెట్ ప్రతిపాదనలు సూచిస్తున్నాయి.

# నరవాణే పుస్తకం వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడ

**జనం వాయిస్, న్యూఢిల్లీ:** మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో భాగంగా మాట్లాడిన రాహుల్, చైనా అంశంపై నరవాణే తన పుస్తకంలో పేర్కొన్న వ్యాఖ్యలను ఉదహరించారు. ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన పేజీలను సభలో చూపిస్తూ, తన వాదనకు అవి ఆధారమని చెప్పారు. అయితే ప్రచురణ కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలు చేయడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ హౌజ్ రూల్స్‌ను ఉల్లంఘించారని ఆరోపించారు. ఆ పుస్తకం నిజంగా ప్రచురితమైందా లేదా అనే విషయాన్ని స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యలకు ఆధారంగా చూపుతున్న పుస్తకాన్ని సభలో ప్రవేశపెట్టాలని ఆయన పట్టుబట్టారు. ఈ అంశంపై రాహుల్, రాజ్‌నాథ్ సింగ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. హోం మంత్రి అమిత్ షా కూడా జోక్యం చేసుకుని వివరణ కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, తాను విశ్వసనీయ సమాచారం ఆధారంగానే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఇండోచైనా సంబంధాలపై మాట్లాడే హక్కు తనకుందని, ఏ నిబంధనలు తనను అడ్డుకోలేవని అన్నారు. చైనాతో సంబంధాలపై చర్చించేందుకు ఏ రూల్స్ అడ్డొస్తున్నాయో చెప్పాలని స్పీకర్‌ను కోరారు. అయితే సభా వ్యవహారాలు కొనసాగుతున్న సమయంలో మ్యాగజైన్‌లు లేదా వార్తాపత్రికల కథనాలను ప్రస్తావించరాదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి మద్దతుగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. చైనా అంశం అత్యంత సున్నితమైనదని, దానిపై సభలో సీరియస్ చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధానంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో ప్రతిపక్ష నేతను అడ్డుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపు తప్పడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

# కవిత వ్యాఖ్యలకు కేటీఆర్ స్పందన

**జనం వాయిస్, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాచరికపు పోకడలకు, నియంతృత్వానికి నిదర్శనమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించిన సంగతి తెలిసిందే. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఎవరు పోటీ చేసినా కారు గుర్తుకు ఓటు వేయాలని కేటీఆర్ పిలుపునిస్తున్నారని ఆమె పేర్కొన్నారు మున్సిపల్ ఎన్నికల్లో గుణం, పనితీరు చూసి ఓటు వేయాలని కవిత సూచించారు. మంచి పనులు చేసే అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని, చెడ్డ అభ్యర్థులకు ఓటు వేయాలని కేటీఆర్ చెప్పడం సరికాదని ఆమె ప్రశ్నించారు. జాగృతి తరపున పోటీ చేసే అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై బరిలో నిలుస్తారని ఈ సందర్భంగా వెల్లడించారు. కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్, ఆమెపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే తగిన చర్యలు తీసుకుందని చెప్పారు. కవిత వ్యాఖ్యలపై తాను ప్రత్యేకంగా స్పందించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ పరంగా ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో రోజూ అనేక మంది అనేక వ్యాఖ్యలు చేస్తుంటారని కేటీఆర్ అన్నారు. ప్రతి వ్యక్తి చేసిన ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం లేదని, అవసరమైన చోట మాత్రమే స్పందిస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాలకు కట్టుబడి కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన సూచించారు.

# తొర్రూరులో 4.5 కిలోల గంజాయి స్వాధీనం

**జనం వాయిస్, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. తొర్రూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ2 ఎం. శివరామకృష్ణ తమ సిబ్బందితో కలిసి ఈరోజు ఉదయం తొర్రూరు బస్టాండ్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో 4.555 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ వెల్లడించారు. పెట్రోలింగ్ సమయంలో తొర్రూరు బస్టాండ్ ప్లాట్‌ఫారం నంబర్2 వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో వారు విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలింది. రైల్వే మార్గంలో తనిఖీలు ఎక్కువగా ఉండటంతో బస్సు మార్గాన్ని ఎంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల్లో మొదటివాడు గంధం యాకయ్య (26), తండ్రి రాములు, నివాసం వనపర్తి జిల్లా కాగా, అతనితో పాటు అదే గ్రామానికి చెందిన మరో యువకుడు (జువైనల్) ఈ అక్రమ రవాణాలో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివసిస్తూ గంజాయి సేవించే అలవాటుకు బానిసలై, గతంలో కూడా పలుమార్లు విశాఖపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థాన రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.2 లక్షల 27 వేల విలువైన 4.555 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తామని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని డీఎస్పీ కృష్ణకిషోర్ హెచ్చరించారు.

# మిషన్ కాకతీయ దేశవ్యాప్తంగా అమలు

**మొదటిపేజీ తరువాయి...** కేంద్రం ప్రకటించింది. ఇది మిషన్ కాకతీయ స్ఫూర్తితోనే రూపుదిద్దుకున్న విధానమని రాజకీయ, పాలనా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చెరువులు, కుంటల పునరుద్ధరణ ద్వారా సాగునీటి వనరులు పెంపొందించాలన్న తెలంగాణ మోడల్‌ను కేంద్రం స్వీకరించడం రాష్ట్ర పాలనా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. మిషన్ కాకతీయ అమలుతో తెలంగాణలో వేలాది చెరువులు పునరుజ్జీవం పొందాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడడమే కాకుండా, భూగర్భ జలాల మట్టాలు పెరిగాయి. రైతులకు సాగునీటి భద్రత కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా రిజర్వాయర్ల అభివృద్ధి చేపట్టడం ద్వారా వ్యవసాయం, మత్స్యకార రంగాలకు ఊతం లభించనుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజికఆర్థిక సర్వే నివేదికలో కూడా తెలంగాణలో అమలైన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలపై ప్రశంసలు కురిపించింది. చాలా తక్కువ కాలంలోనే తెలంగాణలో సాగునీటి విస్తీర్ణం 1.30 కోట్ల ఎకరాల నుంచి 2.20 కోట్ల ఎకరాలకు పెరిగిందని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఈ అసాధారణ పురోగతిని దేశవ్యాప్తంగా అమలు చేయదగిన మోడల్‌గా కేంద్రం గుర్తించడం గమనార్హం. ఇంతకుముందు కూడా కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు, కల్యాణ లక్ష్మి వంటి పథకాలు కేంద్రం, ఇతర రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో అమలయ్యాయి. ఇప్పుడు అదే బాటలో మిషన్ కాకతీయను దేశమంతటా విస్తరించేందుకు కేంద్రం అడుగులు వేయడం, "తెలంగాణ మోడల్" దేశానికి దిక్సూచి అవుతోందని మరోసారి రుజువు చేసింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతం చేయాలి

**మొదటిపేజీ తరువాయి...** శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కేసులో అధికారులు పిలిస్తే తాను పూర్తిగా సహకరిస్తానని, విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రారంభమై ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయ్యిందని గుర్తుచేశారు. విచారణ ఇంతకాలం సాగడం ఏమిటని ప్రశ్నిస్తూ, ఇంకెప్పుడు విచారణ పూర్తవుతుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. సిట్ విచారణపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. సిట్ విచారణలో ఏమి జరిగిందన్న విషయాలను కేసీఆర్ తానే బయటపెడతారని భావిస్తున్నట్లు కవిత తెలిపారు. ఈ కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించడం, అధికారులకు సహకరించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. తన ఫోన్‌తో పాటు తన భర్త ఫోన్‌ను కూడా ట్యాప్ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ, నిజాలు బయటకు రావాలంటే సిట్ విచారణకు పూర్తిగా సహకరించేందుకు సిద్ధమని, అధికారులు పిలిస్తే తప్పకుండా వెళతానని కవిత స్పష్టం చేశారు.



# దావోస్ అమెరికా పర్యటన పూర్తి

**జనం వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్నారు. నిన్న రాత్రి 2.50 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన ల్యాండ్ అయ్యారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న విషయం తెలిసిందే. ఆ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన అమెరికాకు వెళ్లారు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కి చెందిన కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో లీడర్‌షిప్ కోర్సును పూర్తి చేశారు. జనవరి 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన ప్రత్యేక తరగతులకు సీఎం హాజరయ్యారు. ఈ కోర్సులో ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది ప్రతినిధులతో కలిసి ఆయన శిక్షణ పొందారు. పాలన, నాయకత్వం, భవిష్యత్ విధానాలపై ఈ కార్యక్రమంలో విస్తృత చర్చలు జరిగాయి. అమెరికాలో కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం సీఎం రేవంత్ రెడ్డి స్వదేశానికి తిరిగి వచ్చారు. దావోస్ పర్యటన, హార్వర్డ్ లీడర్‌షిప్ కోర్సు నేపథ్యంలో సీఎం పర్యటన రాష్ట్ర రాజకీయ వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది.



# వ్యాక్సిన్ తర్వాత చిన్నారి మృతి

**మొదటిపేజీ తరువాయి...** కొటాల్‌పల్లికి చెందిన అర్చనరమేశ్ దంపతులు అయ్యప్ప నగర్ కాలనీలో నివసిస్తున్నారు. వీరి కుమార్తె క్రితిక్ సారాను జనవరి 25న ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కుక్క కరిచింది. వెంటనే కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా, వైద్యులు వ్యాక్సిన్ డోస్ ఇచ్చారు. ఆదివారం మూడో డోస్ కోసం చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. డోస్ తీసుకున్న వెంటనే చిన్నారి అపస్మారక స్థితికి చేరిందని కుటుంబీకులు తెలిపారు. తక్షణమే ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యమే చిన్నారి మృతికి కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దవాఖానలో ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ బాధితులు సుమారు రెండున్నర గంటలపాటు ఆందోళన కొనసాగించారు. ఈ



ఘటనపై ఆర్ఎంవో సంతోష్ స్పందిస్తూ, పూర్తి స్థాయి విచారణ చేపడతామని తెలిపారు. ఉదయం 11.30 గంటలకు చిన్నారి దవాఖాన నుంచి బయటికి వెళ్లిందని, ప్రైవేట్ దవాఖానకు సుమారు 2.30 గంటలకు చేరుకున్నట్లు చెప్పారు. ఈ మధ్యలో ఏమి జరిగిందన్నది విచారణ అనంతరమే వెల్లడించగలమన్నారు. మొదటి రెండు డోస్‌ల సమయంలో చిన్నారి బాగానే ఉందని, మూడో డోస్ తర్వాత కూడా తక్షణ సమస్యలేమీ కనిపించలేదని పేర్కొంటూ, విచారణ పూర్తయ్యాకే పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

# నామినేషన్ కోసం రూ.8 కోట్ల పన్ను చెల్లింపు

**మొదటిపేజీ తరువాయి...** ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత వెలుగులోకి వచ్చాయి. నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో డైరెక్టర్‌గా ఉన్న నరేందర్ రెడ్డి భార్య కార్పొరేటర్‌గా పోటీ చేయాల్సి ఉండటంతో నో డ్యూ సర్టిఫికేట్ తప్పనిసరి అయ్యింది. బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికేట్ ఇస్తామని అధికారులు స్పష్టం చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు సాగిన వాదనల అనంతరం చట్టం ముందు అందరూ సమానమేనని, బకాయిలు తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో ఆరు భారీ డీడీల రూపంలో మొత్తం రూ.8.16 కోట్లను మున్సిపల్ అధికారులకు సమర్పించారు. ఇది నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో ఒక వ్యక్తి నుంచి ఇంత భారీ పన్ను వసూలైన తొలి ఘటనగా నిలిచింది. సామాన్యుల నుంచి వందల రూపాయల పన్ను కోసం కఠినంగా వ్యవహరించే యంత్రాంగం, ఇన్నేళ్లుగా కోట్ల బకాయిలను ఎందుకు వసూలు చేయలేకపోయిందన్న అంశంపై ఇప్పుడు విస్తృత



చర్చ జరుగుతోంది. ఎన్నికలు వచ్చినప్పుడే బకాయిలు వసూలవుతాయన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మేయర్ పదవి మహిళలకు రిజర్వ్ కావడంతో నరేందర్ రెడ్డి ఈ భారీ మొత్తాన్ని చెల్లించారని స్థానికంగా చర్చ సాగుతోంది. ఈ పన్ను చెల్లింపు రాజకీయంగా ఆయనకు మైలేజ్ ఇస్తుందా, లేక విమర్శలకు దారితీస్తుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. అయితే, ఒక్క రాత్రిలో కార్పొరేషన్ ఖజానా కళకళలాడిన విషయం మాత్రం నగరమంతా హాట్ టాపిక్‌గా మారింది.

# ఉద్యమ కాలం రోజులు మళ్లీ గుర్తొచ్చాయి : కేటీఆర్

- **7,000 గ్రామాల్లో నిరసనలు, దిష్టిబొమ్మల దహనం.**
- **హైదరాబాద్, పట్టణాల్లో భారీ ర్యాలీలు.**
- **పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్.**
- **మమ్మల్ని ఒక్కటి చేసిన రేవంత్ రెడ్డికీ ధన్యవాదాలు.**

**జనం వాయిస్, హైదరాబాద్:** నిన్న జరిగిన పరిణామాలు ఉద్యమ కాలం నాటి రోజులను మళ్లీ గుర్తు చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలిరావడం చూస్తే ఉద్యమ స్ఫూర్తి ఇంకా సజీవంగానే ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7,000 గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మలు దగ్ధం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ నగరంతో పాటు ఇతర పట్టణాల్లో కూడా భారీ ర్యాలీలు నిర్వహించారని చెప్పారు. ఈ నిరసనల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులందరికీ కేటీఆర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలే తమ అసలైన బలం అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలపడం పార్టీ సంస్కృతి అని స్పష్టం చేశారు. అలాగే, ఈ పరిణామాల ద్వారా తమను మరింత ఐక్యం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికూ కృతజ్ఞతలు తెలిపారు. "మమ్మల్ని ఒక్కటి చేసిన రేవంత్ రెడ్డికి కూడా ధన్యవాదాలు" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# "పాంచాలి పంచభర్తృక" టీజర్ ఆవిష్కరణ

**జనం వాయిస్, హైదరాబాద్:** పద్మశ్రీ డా. రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటించిన "పాంచాలి పంచభర్తృక" సినిమా టీజర్‌ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర బృందాన్ని అభినందిస్తూ, ప్రేక్షకులకు ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే ప్రయత్నమే ఈ సినిమా అని మంత్రి పేర్కొన్నారు. హాస్యం ఒక మంచి ఔషధమని, అపహాస్యం కాకుండా కుటుంబమంతా ఆస్వాదించే విధంగా నవ్వును పంచే చిత్రాలు రావాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అలాంటి దిశగా "పాంచాలి పంచభర్తృక" సినిమా ప్రేక్షకులను రంజింపజేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సినీ పరిశ్రమ అభివృద్ధికి, సినిమా కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. తెలుగు సినిమా పరిశ్రమ రాష్ట్ర గర్వకారణమని, దాని ఎదుగుదలకు అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర నిర్మాణ బృందానికి, కళాకారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంచి సందేశంతో పాటు వినోదాన్ని అందించే చిత్రంగా "పాంచాలి పంచభర్తృక" ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆయన ఆకాంక్షించారు.



దైనిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

# కట్టెల పొయ్యి మీద వంట..

**జనం వాయిస్, ఆరోగ్యం:**
భారతీయ సంప్రదాయ వంటగదుల్లో కట్టెల పొయ్యి ఒకప్పుడు అనివార్య భాగంగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా ఇళ్లలో కట్టెల పొయ్యిపైనే వంట కొనసాగుతోంది. ఆధునిక గ్యాస్ స్టౌవులు, ఇండక్షన్‌లు వచ్చినప్పటికీ, కట్టెల పొయ్యిపై వండిన వంటకాలకు ఉండే ప్రత్యేక రుచి, వాసన ఇప్పటికీ మరెక్కడా దొరకదని పెద్దలు చెబుతుంటారు. సంప్రదాయంతో పాటు ప్రకృతికి దగ్గరగా ఉండే ఈ వంట విధానం మన ఆహార సంస్కృతిలో కీలక స్థానం సంపాదించుకుంది.

**- రుచి, వాసనలో ప్రత్యేకత**
కట్టెల పొయ్యిపై వండిన అన్నం, పప్పు, కూరలు, చట్నీలు ప్రత్యేకమైన వాసనతో పాటు సహజమైన రుచిని అందిస్తాయని గృహిణులు చెబుతున్నారు. మెల్లగా మంటపై ఉడకడం వల్ల ఆహారంలోని సహజ గుణాలు నిల్వ ఉంటాయని అభిప్రాయం. ముఖ్యంగా మట్టి పాత్రల్లో కట్టెల పొయ్యిపై వండిన వంటకాలు మరింత రుచికరంగా ఉంటాయని, ఆహారానికి ఒక ప్రత్యేకమైన గ్రామీణ ముద్ర పడుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగానే కొన్ని హోటళ్లు కూడా "కట్టెల పొయ్యి వంట" అనే పేరుతో ప్రత్యేక వంటకాలను అందిస్తున్నాయి.

## సంప్రదాయం, రుచి, ఆరోగ్యం కలయిక






**- ఆరోగ్య పరంగా ఉన్న లాభాలు**
కట్టెల పొయ్యిపై మెల్లగా వండే విధానం వల్ల ఆహారం పూర్తిగా ఉడికిపోయి తేలికగా జీర్ణమవుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అధిక వేడి కాకుండా సహజ మంటపై వండటం వల్ల పోషకాలు ఎక్కువగా నశించకుండా ఉండే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. మట్టి పాత్రల్లో వండినప్పుడు ఖనిజాలు ఆహారంలో కలిసే అవకాశం ఉండటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కూడా చెబుతున్నారు. అయితే పొగ ఎక్కువగా ఉండే చోట సరైన గాలి ప్రసరణ లేకపోతే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**- జాగ్రత్తలు, ఆధునిక అవసరాలతో సమతుల్యం**
కట్టెల పొయ్యి వంట సంప్రదాయంగా, ఆరోగ్యకరంగా ఉన్నప్పటికీ కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు. వంటగదిలో సరైన వెంటిలేషన్ ఉండాలి, పొగ బయటకు వెళ్లేలా ఏర్పాటు చేయాలి. పొగ వల్ల కళ్ల మంట, శ్వాస సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా మెరుగైన చిమ్నీ వ్యవస్థలు, సురక్షిత కట్టెల పొయ్యిలు వాడితే సంప్రదాయం, ఆరోగ్యం రెండూ కలిసి కొనసాగవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కట్టెల పొయ్యి మీద వంట అనేది కేవలం వంట విధానం మాత్రమే కాదు, మన సంస్కృతి, జీవనశైలిని గుర్తుచేసే ఒక జీవంత సంప్రదాయమని వారు పేర్కొంటున్నారు.

# సూర్యోదయం ఆరోగ్యానికి, మనసుకు కొత్త ఆరంభం



**జనం వాయిస్, ఆరోగ్యం:**
ప్రతి రోజు జరిగే సహజ అద్భుతాల్లో సూర్యోదయం ఒకటి. తూర్పు దిక్కున నెమ్మదిగా ఉదయించే సూర్యుడు చీకటిని తొలగిస్తూ వెలుగును ప్రసరింపజేయడం మన జీవితానికి పూర్వక సందేశంలా భావిస్తారు నిపుణులు. రాత్రి నిశ్శబ్దం తర్వాత ఉదయం వచ్చే సూర్యకాంతి మనసుకు ఆశను, శరీరానికి ఉత్సాహాన్ని ఇస్తుందని చెబుతున్నారు. బిజీ జీవనశైలిలో చాలామంది ఈ సూర్యోదయాన్ని చూడకుండానే రోజు మొదలుపెడుతున్నారని, అయితే దీనివల్ల కోల్పోతున్న ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

**- శారీరక ఆరోగ్యంపై సూర్యోదయ ప్రభావం**
ఉదయం సూర్యోదయ సమయంలో లభించే సహజ సూర్యకాంతి శరీరానికి ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో వచ్చే సాఫ్ట్ సన్‌లైట్ వల్ల శరీరంలో విటమిన్‌డి ఉత్పత్తి పెరిగి ఎముకల బలం, రోగనిరోధక శక్తి మెరుగవుతుందని సూచిస్తున్నారు. అలాగే సూర్యోదయ సమయంలో బయటకు వెళ్లడం వల్ల శరీర గడియారం సరిగా పనిచేసి నిద్రజాగరణ చక్రం సమతుల్యంలో ఉంటుందని చెబుతున్నారు. దీని కారణంగా నిద్ర నాణ్యత మెరుగుపడి, అలసట తగ్గుతుందని వైద్యుల అభిప్రాయం.




**- మనసుకు ప్రశాంతత, ఆలోచనలకు స్పష్టత**
సూర్యోదయాన్ని చూడడం మనసుకు ప్రత్యేకమైన ప్రశాంతతను ఇస్తుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఉదయం వేళ ప్రకృతి నిశ్శబ్దంగా ఉండటంతో మన ఆలోచనలు స్పష్టంగా మారతాయని, ఒత్తిడి స్థాయి తగ్గుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ సమయంలో ధ్యానం, ప్రాణాయామం, తేలికపాటి వాకింగ్ చేస్తే మానసిక స్థిరత్వం మరింత పెరుగుతుందని సూచిస్తున్నారు. రోజును సానుకూల ఆలోచనలతో ప్రారంభించేందుకు సూర్యోదయం ఒక సహజ ప్రేరణగా పనిచేస్తుందని నిపుణుల అభిప్రాయం.

**- జీవనశైలిలో సూర్యోదయానికి స్థానం ఇవ్వాలి**
సూర్యోదయం చూడడం ఒక అలవాటుగా మారితే జీవనశైలి మొత్తం మారిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయం తొందరగా లేవడం, ప్రకృతితో కొద్దిసేపు గడపడం వల్ల శరీరం, మనసు రెండూ చురుకుగా మారతాయని సూచిస్తున్నారు. మొబైల్ స్క్రీన్‌లకే పరిమితమవకుండా, రోజుకు కొన్ని నిమిషాలైనా సూర్యోదయాన్ని చూడటానికి కేటాయిస్తే దీర్ఘకాలంలో ఆరోగ్యం, మానసిక సంతోషం రెండూ మెరుగవుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రతి రోజు కొత్త ఆశతో మొదలవ్వాలంటే సూర్యోదయం ఇచ్చే సందేశాన్ని మన జీవితంలో అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.




# టీ20 ప్రపంచకప్ హిస్టరీలో తోపు ప్లేయర్లు వీళ్లే భయ్యో

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

టీ20 ప్రపంచకప్ అంటేనే పరుగుల వర్షం. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొని నిలకడగా పరుగులు చేయడం అంత ఈజీ కాదు. 2007లో ప్రారంభమైన ఈ మెగా టోర్నీలో ఎంతోమంది దిగ్గజ ఆటగాళ్లు తమ సత్తా చాటారు. ఫిబ్రవరి 2026 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన టాప్ 5 ఆటగాళ్లు వీరే. ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం విశేషం. అగ్రస్థానంలో విరాట్ కోహ్లీ నిలిచాడు. అతడు టీ20 ప్రపంచకప్‌ల్లో మొత్తం 1292 పరుగులు చేశాడు. అద్భుతమైన స్థిరత్వం, ఒత్తిడిలోనూ రాణించే స్వభావంతో విరాట్ ఈ రికార్డును సాధించాడు. ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఘనత కూడా అతడికే దక్కింది. రెండో స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. 1220 పరుగులతో హిట్‌మ్యాన్ ఈ జాబితాలో నిలిచాడు. 2007 నుంచి అన్ని ప్రపంచకప్‌ల్లో ఆడిన ఆటగాడిగా రోహిత్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఓపెనర్‌గా జట్టుకు వేగవంతమైన ఆరంభాలు ఇవ్వడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. మూడో స్థానంలో శ్రీలంక దిగ్గజం మహేళ జయవర్ధనే ఉన్నాడు. అతడు టీ20 ప్రపంచకప్‌ల్లో 1016 పరుగులు సాధించాడు. క్లాసిక్ బ్యాటింగ్‌తో టీ20ల్లో కూడా విజయం సాధించవచ్చని నిరూపించిన ఆటగాడు జయవర్ధనే. నాలుగో స్థానాన్ని ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ దక్కించుకున్నాడు. 1013 పరుగులతో టాప్ 5లో నిలిచిన అతడు, ఈ జాబితాలో ఉన్న యాక్టివ్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు. దూకుడైన ఆటతో ప్రత్యర్థులకు ఎప్పుడూ ముప్పుగా మారే ఆటగాడు బట్లర్. ఐదో స్థానంలో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. అతడు 984 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా తొలి టీ20 ప్రపంచకప్ విజయంలో వార్నర్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా టీ20 ప్రపంచకప్ చరిత్రలో టాప్ 5 పరుగుల వీరుల జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం దేశ అభిమానులకు గర్వకారణంగా మారింది. రాబోయే ప్రపంచకప్‌లో ఈ రికార్డులు మరింత మారుతాయా అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

# భారత్‌ను చూసి పాక్ భయపడుతోంది

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై ఆ దేశ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా తీవ్ర విమర్శలు గుప్పించాడు. ఈ నిర్ణయం వల్ల పాకిస్థాన్ క్రికెట్‌కే ఎక్కువ నష్టం జరుగుతుందని, టీమిండియాను ఎదుర్కోవడానికి పాక్ భయపడుతోందనే సంకేతాలు ప్రపంచానికి వెళ్తాయని వ్యాఖ్యానించాడు. ఈ నెల 15న భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో ఆడబోమని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కనేరియా స్పందించాడు. గతంలో భారత్‌లో ఆడబోమని పాక్ కోరినప్పుడు, తటస్థ వేదికగా శ్రీలంకను నిర్ణయించారని గుర్తుచేశాడు. అలాంటప్పుడు ఇప్పుడు మ్యాచ్‌ను బహిష్కరించడంలో ఎలాంటి అర్థం లేదని స్పష్టం చేశాడు. ఈ నిర్ణయంతో పాకిస్థాన్ తమ సెమీఫైనల్ అవకాశాలను మరింత క్లిష్టతరం చేసుకుందని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం భారత్ ఆడుతున్న స్థాయి క్రికెట్ ముందు పాక్ నిలబడలేకపోతోందని, ప్రపంచకప్‌లలో వరుసగా భారత్ చేతిలో ఓటములు ఎదురవుతున్నాయని కనేరియా పేర్కొన్నాడు. భవిష్యత్తులో సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో తలపడాల్సి వస్తే అప్పుడు కూడా ఆడకుండా తప్పుకుంటారా అంటూ ప్రశ్నించాడు. మైదానంలో పోరాడి గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలి కానీ, బహిష్కరణ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని హితవు పలికాడు. ఈ నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెటర్లలో చాలామంది అసంతృప్తితో ఉన్నప్పటికీ, పరిస్థితుల వల్ల వారు బహిరంగంగా మాట్లాడలేని స్థితిలో ఉన్నారని కనేరియా వ్యాఖ్యానించాడు. మొత్తానికి ఈ అంశం పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# భారత్‌తో మ్యాచ్ ఆడకపోవడం బాధాకరం.

## - పాక్ మాజీ కెప్టెన్ అఫ్రిది వ్యాఖ్యలు..!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో మ్యాచ్ ఆడకపోవడంపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది స్పందించాడు. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీలో పాల్గొంటామని, కానీ భారత్‌తో మ్యాచ్‌లను బహిష్కరిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పాక్ ప్రభుత్వ సూచన మేరకే తీసుకున్నదని బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అఫ్రిది మాట్లాడుతూ రాజకీయాల వల్ల క్రికెట్‌కు ఆటంకాలు రావడం తనను బాధిస్తోందని వ్యాఖ్యానించాడు. రాజకీయాలు తలుపులు మూసినప్పుడు క్రికెట్ తలుపులు తెరవాలన్న నమ్మకం తనకు ఎప్పుడూ ఉందని చెప్పాడు. కానీ ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలో భారత్‌తో మ్యాచ్ జరగకపోవడం బాధాకరమని అభిప్రాయపడ్డాడు. అయినప్పటికీ ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవించాల్సిందేనని, ఆటగాళ్లు మరియు మాజీ ఆటగాళ్లు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సి వస్తుందని అఫ్రిది స్పష్టం చేశాడు. ఈ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి మాటలతో కాకుండా చర్యలతో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించాడు. భారత్‌తో మ్యాచ్ అంశంపై తీసుకునే నిర్ణయాలే పాకిస్థాన్ క్రికెట్ భవిష్య కార్యాచరణను నిర్ణయిస్తాయని, అంతర్జాతీయ క్రికెట్ మండలి వైఖరిపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమై ఉందని అఫ్రిది వ్యాఖ్యానించాడు.



# ఇది కేవలం క్రికెట్ కాదు రూ.4500 కోట్ల వ్యాపారం

## - భారత్‌పాక్ మ్యాచ్‌పై సర్వత్ర ఉత్కంఠ!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**


టీట్వెంటీ ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ ఇప్పుడు కేవలం క్రీడా పోరాటంగా కాకుండా భారీ ఆర్థిక అంశంగా మారింది. ఈ ఒక్క మ్యాచ్ విలువ సుమారు రూ.4500 కోట్లుగా అంచనా వేయబడుతోంది. ప్రసార హక్కులు, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్, టికెట్ అమ్మకాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు కలిపి ఈ స్థాయి వ్యాపారం జరుగుతుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఈ మ్యాచ్‌ను టోర్నమెంట్‌కు వెన్నుదన్నుగా భావిస్తారు. పాకిస్థాన్ భారత్‌తో మ్యాచ్ ఆడబోమని వెనుకడుగు వేయడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్రంగా స్పందించింది. ఇది రాజకీయ అంశం కాదని, భారీ ఆర్థిక నష్టాలకు దారి తీసే నిర్ణయమని హెచ్చరించింది. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయితే ప్రసార సంస్థలకు ఒక్క మ్యాచ్ ద్వారానే రూ.300 కోట్లకు పైగా ప్రకటనల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రసార సంస్థలు ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ మ్యాచ్ రద్దు ప్రభావం కేవలం ప్రసారకర్తలకే కాకుండా క్రికెట్ బోర్డులపై కూడా పడనుంది. అంచనాల ప్రకారం భారత్, పాకిస్థాన్ బోర్డులకు చెరో రూ.200 కోట్ల మేర ప్రత్యక్ష, పరోక్ష నష్టం వాటిల్లే అవకాశం ఉంది. భారత్ ఈ నష్టాన్ని భరించగలిగినా, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు మాత్రం ఇది తీవ్ర దెబ్బగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదాయంలో పాకిస్థాన్‌కు ఏడాదికి గణనీయమైన వాటా లభిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించి స్వచ్ఛందంగా మ్యాచ్‌కు దూరమైతే ఆ నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు జరిమానాలు, చట్టపరమైన సమస్యలు, భవిష్యత్తులో టోర్నమెంట్ల నిర్వహణ అవకాశాలు కోల్పోయే పరిస్థితి కూడా తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆర్థిక నష్టాల కంటే పెద్ద సమస్య ప్రతిష్ఠకు భంగం కలగడమేనని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకసారి పాకిస్థాన్ మ్యాచ్‌లు ప్రమాదకరంగా భావించబడితే భవిష్యత్తులో ప్రసార హక్కుల విలువ తగ్గడం, స్పాన్సర్లు వెనక్కి తగ్గడం తప్పదని అంటున్నారు. ఈ ఒక్క నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్తుపై దీర్ఘకాల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.




# అందమే అసూయ పడేలా.

జనం వాయిస్, సినిమా: జాతిరత్నాలు చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఫరియా అబ్దుల్లా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. చిట్టి పాత్రతో యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి తనదైన గుర్తింపును కొనసాగిస్తోంది. ప్రస్తుతం సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది.తాజాగా ఫరియా షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. మెరూన్ కలర్ చీరకట్టులో చిరునవ్వులతో కనిపిస్తూ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. చేతిలో గులాబీ పువ్వు పట్టుకుని ముసి ముసి నవ్వులతో ఇచ్చిన ఫోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. బ్లూ అండ్ ఆరెంజ్ కాంబినేషన్‌లో ఉన్న ప్లెయిన్ చీరలో కాటుక కళ్లతో మరింత అందంగా కనిపిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.సినిమాల పరంగా చూస్తే హీరోయిన్‌గా మాత్రమే కాకుండా స్పెషల్ సాంగ్స్‌తో కూడా ఫరియా మంచి పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం తిరువీర్ హీరోగా నటిస్తున్న భగవంతుడు చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందన్న సమాచారం ఉంది. ఈ సినిమాలో పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటిస్తూ తన నటనతో మరోసారి మెప్పించనుందన్న టాక్ వినిపిస్తోంది.మొత్తానికి సోషల్ మీడియాలో ఫరియా షేర్ చేసిన తాజా ఫోటోలు అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారాయి. చిట్టి అందానికి కామెంట్ల రూపంలో ప్రశంసల వర్షం కురుస్తుండగా ఆమె తదుపరి సినిమాలపై ఆసక్తి మరింత పెరుగుతోంది.


# నానికి జోడీగా బుట్టబొమ్మ.. ఫస్ట్ టైం ఫ్రెష్ కాంబో..!



జనం వాయిస్, సినిమా: తెలుగు సినీ పరిశ్రమలో మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతోంది. నేచురల్ స్టార్ నాని, సాహో ఫేం దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో కొత్త సినిమా తెరకెక్కనున్నట్టు సమాచారం. సహజ నటనతో పాటు ప్రయోగాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైలిష్ యాక్షన్ అవతారంలో కనిపించనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి హీరోయిన్‌గా బుట్టబొమ్మగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు టాక్ నడుస్తోంది. నాని, పూజా హెగ్డే తొలిసారి జోడీ కట్టనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఫ్రెష్ కాంబినేషన్ కావడంతో పాటు స్టైలిష్ యాక్షన్ కథాంశంతో సినిమా రూపొందనుందని తెలుస్తోంది.ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభం కానుండగా, గ్రాండ్ స్థాయిలో నిర్మించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. థియేట్రికల్ రిలీజ్‌ను 2027లో లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్. నాని కెరీర్‌లో మరో డిఫరెంట్ ప్రాజెక్ట్‌గా నిలవనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబోపై పెరుగుతున్న హైప్

## - ఆదర్శ కుటుంబం చిత్రంపై ఇండస్ట్రీ దృష్టి




జనం వాయిస్, సినిమా: టాలీవుడ్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లకు చిరునామాగా నిలిచిన విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యుత్తమ దశను ఆస్వాదిస్తున్నారు. వయసు పెరుగుతున్నా ఆయన ఇమేజ్, నటనలో ఎలాంటి తగ్గుదల లేకుండా వరుసగా ప్రేక్షకులను అలరిస్తుండటం విశేషం. థియేటర్లతో పాటు ఓటీటీ వేదికల్లోనూ ఆయన చిత్రాలు మంచి స్పందన అందుకోవడంతో వెంకటేశ్ మార్కెట్ మరింత బలపడింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో ఆయనకు ఉన్న ఆదరణ రోజురోజుకు పెరుగుతుండటంతో నిర్మాతలు కూడా ఆయనతో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న క్రేజీ కలయిక ఇప్పుడు నిజమవుతోంది.మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ఆదర్శ కుటుంబం ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు కథ రచయితగా వెంకటేశ్‌తో కలిసి పనిచేసిన త్రివిక్రమ్ ఇప్పుడు దర్శకుడిగా మొదటిసారి ఆయనతో జతకట్టడం సినిమాపై భారీ అంచనాలు పెంచింది. ఇటీవల విడుదలైన టైటిల్ ప్రకటన, ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి.అయితే షూటింగ్ ప్రారంభమైన తర్వాత కొన్ని సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదన్న ఉద్దేశంతో త్రివిక్రమ్ సాంకేతిక బృందంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సమాచారం. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్ విభాగాల్లో మార్పులు జరిగినట్టు టాక్ నడుస్తోంది. ముందుగా రూపొందించిన భారీ సెట్‌పై పూర్తిగా సంతృప్తి చెందక దాన్ని తిరిగి డిజైన్ చేయించినట్లు వినిపిస్తోంది.ఈ మార్పుల కారణంగా షూటింగ్ షెడ్యూల్‌లో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, క్వాలిటీ విషయంలో మాత్రం మేకర్స్ ఎలాంటి రాజీ లేకుండా ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే వేసవిలో సినిమాను విడుదల చేయాలని ఇప్పటికే నిర్మాణ సంస్థ ప్రకటించగా, ఆ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని బృందం పక్కా ప్రణాళికలతో పని చేస్తున్నట్లు సమాచారం. భారీ సెట్ తిరిగి నిర్మాణం షూటింగ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలు ఉన్నా, విడుదల విషయంలో నిర్మాతలు పూర్తి నమ్మకంతో ఉన్నారని టాక్.ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర కథలో ప్రత్యేకమైన మలుపుగా ఉండబోతుందని ప్రచారం జరుగుతోంది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు తోడు క్రైమ్ అంశాల మేళవింపుతో ఆదర్శ కుటుంబం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

# జైలర్ 2 షెడ్యూల్‌లో షారుక్ ఖాన్..

**జనం వాయిస్, సినిమా:** తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న మోస్ట్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2పై అభిమానుల్లో అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు తిరిగి కనిపించనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడవడంతో సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.






తాజా సమాచారం ప్రకారం జైలర్ 2 తదుపరి షెడ్యూల్ ముంబైలో ప్రారంభం కానుంది. వచ్చే వారం నుంచి మొదలయ్యే ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ షూటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలిసింది. ఈ దశలో ఆయనపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారని సమాచారం. నెల్సన్ షారుక్ ఖాన్‌ను ఏ తరహా ప్రత్యేక పాత్రలో చూపించబోతున్నాడన్నది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. రజినీకాంత్, షారుక్ ఖాన్ కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారా అనే ఆసక్తి అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతోంది. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ఇప్పటికే నిర్ణయించారు. ఈ సీక్వెల్‌లో విద్యాబాలన్, సంతానం తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారని సమాచారం. మొదటి భాగంలో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, తమన్నా, మోహన్ లాల్, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సీక్వెల్‌లో ఇంకా ఎవరెవరు కనిపించనున్నారన్న విషయంపై త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# వరుణ్ తేజ్ కెరీర్‌కు కీలక మలుపు..!

జనం వాయిస్, సినిమా: మెగా బ్రదర్ నాగబాబు వారసుడిగా ముకుంద చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తొలి సినిమాతోనే మంచి గుర్తింపును సంపాదించాడు. ఆ తరువాత మాస్ మూసలో ఇరుక్కోకుండా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిర్మించుకున్నాడు. కమర్షియల్ సినిమాలతో పాటు ప్రయోగాత్మక కథలను స్వీకరిస్తూ యువ హీరోల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాడు. అయితే గత కొంతకాలంగా వరుస పరాజయాలు ఎదురవ్వడంతో వరుణ్ తేజ్ కెరీర్‌పై ఒత్తిడి పెరిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. మార్కెట్ పరంగా కూడా కొంత ప్రభావం పడిందన్న టాక్ సాగుతోంది. ఈ పరిస్థితుల్లోనే మళ్లీ విజయబాట పట్టాలనే లక్ష్యంతో వరుణ్ తేజ్ తన తదుపరి ప్రాజెక్టుల ఎంపికలో మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కెరీర్‌ను మలుపుతిప్పే బలమైన హిట్ కోసం కథలను ఆచితూచి పరిశీలిస్తున్నాడని సమాచారం. ఈ క్రమంలో తాజాగా వినిపిస్తున్న ఓ వార్త సోషల్ మీడియాలో భారీగా చర్చకు దారి తీసింది. కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీతో వరుణ్ తేజ్ సినిమా చేయబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. భారీ విజయాన్ని అందుకున్న చిత్రాలతో దర్శకుడిగా తన సత్తా నిరూపించుకున్న అట్లీ ప్రస్తుతం అగ్ర హీరోలతో భారీ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నాడు. ఆయనతో వరుణ్ తేజ్ కాంబినేషన్ నిజమైతే, ఇది వరుణ్ కెరీర్‌లోనే అతిపెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. వరుణ్ కోసం ఓ పవర్‌ఫుల్ కమర్షియల్ యాక్షన్ కథ సిద్ధంగా ఉందన్న ప్రచారం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా, ఈ వార్త ఒక్కసారిగా వరుణ్ తేజ్ మార్కెట్‌పై పాజిటివ్ బజ్‌ను తీసుకొచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలా ఉండగా వరుణ్ తేజ్ ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న కొరియన్ కనకరాజు చిత్రంలో నటిస్తున్నాడు. హారర్ కామెడీ నేపథ్యంతో, కొరియన్ టచ్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమా ఫలితం, అలాగే అట్లీ కాంబోపై వస్తున్న వార్తలు వరుణ్ తేజ్ కెరీర్‌ను మళ్లీ సరైన దిశలోకి తీసుకెళ్లే అవకాశముందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.




Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com